క్లుప్తంగా

'హామీల అమలుకు ఉద్యమిస్తాం'



మాట్లాడుతున్న అక్కినేని వనజ

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా ఎన్నికల హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందిందని, వాటి అమలు కోసం ఉద్యమాలు చేస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. బాడిశ రాము అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు ఆగస్టు 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలపై విద్యుత్ భారాలు వేయకుండా చూస్తామని హామీ ఇచ్చి, నేడు స్మార్ట్ మీటర్లు పేరుతో మరింత భారాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలపై వేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, నేతలు డి.ప్రభాకర్, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా మహా యజ్ఞానికి తరలిరండి



పెనుమాక వాసుదేవరావు

దెందులూరు: ఈనెల 19న హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో హనుమాన్ చాలీసా మహా యజ్ఞంకు భక్తులంతా తరలి రావాలని బ్రాహ్మణ సేవా సంఘం ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు పెనుమాక వాసుదేవరావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం మాదేపల్లిలో ఆయన మాట్లాడారు. 1108 గొంతుకలతో భక్తితో ఒకే సంకల్పంతో ఏకకాలంలో జరిగే హనుమాన్ చాలీసా మహా యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం తీసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ వస్తువుల నివారణ చర్యలు

దెందులూరు: ప్లాస్టిక్ వస్తువుల నివారణకు కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీలత కోరారు. శుక్రవారం ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఏలూరు రూరల్ మండలంలో ఏర్పాటైన టీములు శనివారం ప్లాస్టిక్ వస్తువుల వాడకం, పొల్యూషన్ నష్టాలు పర్యావరణ పరిరక్షణకు తూట్లు ఇతర అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ, ప్రతి గ్రామంలో విధిగా టీములు పంచాయతీ సిబ్బంది ప్లాస్టిక్ వస్తువులను తొలగించాలన్నారు అన్ని గ్రామ శివారు ప్రాంతాల్లో జరిగే ఈ కార్యక్రమాన్ని ఈవోపీఆర్డీ ఎంపీడీఓ పర్యవేక్షణ ఉంటుందన్నారు.

నాణ్యతా లోపం.. గోతులు పునరావృతం

- ఏలురులో రోడ్ల మరమ్మతుల్లో నాణ్యత డొల్లే!
- మూడు నెలలకే పైకిలేచిన కంకర
- ప్రయాణికులకు తప్పని పాట్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో ఏ రోడ్డు చూసినా ఏముంది గర్వకారణం, సమస్తం గోతుల మయం అన్న చందంగా తయారయ్యాయి. మూడు నెలల క్రితం ఆర్భాటంగా రోడ్లకు మరమ్మతులు చేయించారు. ఆ పనుల్లో నాణ్యత లోపించడంతో నేడు యథావిధిగా గోతులు దర్శనమిస్తున్నాయి. జూట్ మిల్లు సెంటర్ నుంచి కైకలూరు రోడ్డు, వంగాయగూడెం సెంటర్ నుంచి కొత్తూరు రోడ్డు, చాటపర్రు రోడ్డు, ఫిలోస్‌పేటలోని రోడ్లు, వంగాయగూడెంలోని రోడ్లపై గోతులు ప్రత్యక్షమయ్యాయి. వీటిపై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

విసుపోతున్న ప్రజలు

ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం రూ.1.25 కోట్ల అంచనాలతో 600 రోడ్లకు ప్యాచ్ వర్కులు చేపట్టినట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారు. వీటికి ఆర్‌అండ్‌బీ రహదారుల్లో చేపట్టిన పనులు అదనంగా ఉన్నాయి. ప్రధాన రహదారులు, నిత్యం జనం రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లకు మరమ్మతులు చేశారు. ప్రమాదాల నుంచి బయట పడొచ్చనుకున్న ప్రజలు పూడ్చిన చోట్ల గోతులు ప్రత్యక్షమవడంతో విసుపోతున్నారు.



తూర్పు వీధి గంగానమ్మ గుడి సెంటర్‌లో ఏర్పడిన పెద్ద గొయ్యి



వైఎంహెచ్‌ఏ హాల్ రోడ్డు సెంటర్‌లో రోడ్డుపై ఏర్పడిన గోతులు



వంగాయగూడెం సెంటర్‌లో పైకి లేచిపోయిన కంకర రాళ్లు



ఫిల్‌హౌస్‌పేట రోడ్డులో ఎగసిపడుతున్న దుమ్ము

తూతూ మంత్రంగా పనులు

ఏలూరు - కైకలూరు రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో రోడ్డును పూర్తిగా బాగుచేశామని చెప్పారు. అయితే ఈ మార్గంలో పలు ప్రాంతాల్లో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. వంగాయగూడెం సెంటర్ నుంచి ఇటు కై కలూరు వైపు, అటు కొత్తూరు వైపు వెళ్లే మార్గంలోనూ రోడ్లపై పూడ్చిన గోతులు తిరిగి కంకర పైకి లేచి యథావిధిగా గోతులతో దర్శనమిస్తున్నాయి. ఇలా ఏలూరు కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన పనులన్నింటిలోనూ నాణ్యతా లోపం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది.

కొట్టొచ్చినట్లు కన్పిస్తున్న నాణ్యతా లోపం



ఏలూరు - కై కలూరు రోడ్డులో గత మూడు నెలల కిందట మరమ్మతులు చేపట్టారు. మళ్లీ యథావిధిగా పనులుచేసిన పలు చోట్ల గోతులు దర్శనమిస్తున్నాయి. చిరంజీవి బస్టాండ్‌కు కొంచెం దూరంలో స్పీడు బ్రేకర్ వద్ద ఏర్పడిన పెద్ద గొయ్యి కారణంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు స్కిడ్ అవుతున్నాయి. నాణ్యతతో మరమ్మతులు చేయించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

అధ్వానంగా రోడ్లు



నగరపాలక సంస్థ పరిధిలోని రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. మూడు నెలలు తిరక్కుండానే కంకర పైకి లేచిపోవడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బందికగా మారింది. ఆదమరిచి వాహనాలు నడిపితే ప్రమాదాలకు లోనవుతున్నారు. ప్రచార ఆర్భాటం మినహా పనుల్లో ఎక్కడా నాణ్యత లేదు. మొక్కుబడిగా కాకుండా పూర్తి నాణ్యతతో పలు చేసేవాల అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

– బి.సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ, ఏలూరు

రక్షణ కల్పించాలంటూ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఏలూరులోని మొబైల్ షాపుల యజమాల నుంచి తమ షాపులకు, షాపులో పనిచేసే కార్మికులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఏలూరులోని మొబైల్ విడిభాగాల షాపు యజమానులు, సిబ్బంది శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సుమారు 15 ఏళ్లుగా రాజస్థాన్ నుంచి వచ్చిన తాము ఏలూరులో షాపులు అద్దెకి తీసుకొని, మొబైల్ విడిభాగాలు విక్రయిస్తున్నట్టు చెప్పారు. ఇటీవల తమ షాపులపై కొందరు భౌతిక దాడులు చేయగా, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు, ఎస్పీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో 17 మొబైల్ విడిభాగాల షాపు యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): సుంకరవారితోట సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మాదేపల్లిరోడ్డు, సుంకరవారితోట, ప్రేమాలయం ప్రాంతం, గాయత్రినగర్, వెంకటాపురం ఎంపీ రోడ్డు, జాలిపూడి, లింగారావుగూడెం, కాట్లంపూడి, శ్రీపర్రు, మానూరు, ఎంహెచ్‌పురం, కలకుర్రు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

శాకంబరిగా అమ్మవార్ల దర్శనం



పత్తేబాద కనకదుర్గమ్మ



బాలా త్రిపుర సుందరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆషాఢమాసం ఆఖరి శుక్రవారం పర్వదినం సందర్భంగా నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు శాకంబరి అలంకరణ చేశారు. మహిళలు సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించారు. పత్తేబాద కనకదుర్గ ఆలయంతో పాటు దక్షిణపు వీధి మార్కండేయ ఒంకార విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో బాలా త్రిపుర సుందరి అమ్మవారికి, కోటదిబ్బ గణపతి త్రిదేవి ఆలయంలో అమ్మవార్లకు శాకాంబరి అలంకరణ చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

నిరుద్యోగుల పాలిట శాపం కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో ఒక్క కొత్త ప్రభుత్వ ఉద్యోగమైనా ఇచ్చారా? కనీసం ఎన్నికల హామీల్లో ముఖ్యమైన నిరుద్యోగ భృతి వేశారా అంటూ వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ ప్రశ్నించారు. ఏలూరు నగరంలో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నేతలు మూడు డివిజన్లలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. 35, 43 డివిజన్లలో పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, 44వ డివిజన్‌లో పార్టీ నేతలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సమన్వయకర్త జేపీ మాట్లాడుతూ టీడీపీ, జనసేన అధినేతలు ఇద్దరూ గత ఎన్నికల్లో సంయుక్తంగా ప్రజలను ఎన్నికల హామీలను నెరవేర్చుతామంటూ హామీ పత్రాలను ఇచ్చారని, ఏడాది గడచినా దాసి ఊసే లేదని ఆరోపించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది 4 లక్షల ఉద్యోగాల చొప్పున ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగ యువతను నమ్మించారని గుర్తుచేశారు. ఆఖరికి వలంటీర్లను సైతం దారుణంగా మోసం చేశారనీ, రూ.10 వేలు ఇస్తామని చెప్పారని, గౌరవవేతనం సంగతి అటుంచి కనీసం ఉపాధి లేకుండా తొలగించారని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య రంగాన్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. నేడు పేదలకు పెద్ద రోగమొస్తే ఎక్కడికి వెళ్లాలో తెలియక తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, ఆరోగ్యశ్రీ బకాయిలు సైతం చెల్లించకపోవటంతో హాస్పిటల్స్‌లో పేదలకు వైద్యం అందే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమాల్లో స్థానిక నేతలు గుడిదేశి లక్ష్మీశారద, గేదెల సూర్యనారాయణ, కాగాని అచ్చిబాబు, రౌతు రామకృష్ణ, గొర్రెల శ్రీనివాస్, కే.వెంకటేశ్వరరావు, మజ్జి ప్రసాద్, మజ్జి లక్ష్మి, మీసాల రమణమ్మ, యలమాటి కృష్ణ, మేతర సురేష్, కొవ్వాడ దుర్గారావు, మల్లెల సత్యనారాయణ, బుజ్జమ్మ, కొత్తపల్లి రాణి, మధుబాబు, నామాల రమేష్, యేసుబాబు, ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్ గురునాథ్, నగర బీసీ సెల్ అధ్యక్షులు కిలాడి దుర్గారావు, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎంఆర్, పార్టీ నేతలు కొల్లిపాక సురేష్, తులసీ, యువజన నాయకులు దాలి వెంకటేష్, సాయి ప్రదీప్, బండ్లమూడి సునీల్, బసవ, సత్యనారాయణ, ఉమా మహేశ్వరరావు తదితరులు ఉన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జేపీ, పార్టీ నేతలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సమన్వయకర్త జేపీ

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	32	బీర్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	36
బెండకాయలు	24	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	76	కంద	--
కాకర కాయలు	40	బీట్‌రూట్	38
బీరకాయలు	24	కీరా దోస	50
బీరకాయలు (పందిరి)	30	ఫ్రెంచ్‌బీన్స్	96
క్యాబేజీ	26	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	32	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	26	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	96
పొట్లకాయ(1)	25-30	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	36
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	31
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

చేపల చెరువుల్లో జంతు వ్యర్థాలు

- దుర్గంధంతో రైతుల ఇబ్బందులు
- చెరువుల వద్దే భారీగా జంతు వ్యర్థాల నిల్వలు



మంగపతిదేవి పేట సమీపంలో వ్యర్థాలతో నిండి ఉన్న చెరువు



జంతు వ్యర్థాలతో దాణా తయారీకి ఉపయోగిస్తున్న యంత్రం



గంగవరం చెరువులో వ్యర్థాల ప్రభావానికి చనిపోయిన చేపలు

కొయ్యలగూడెం: జంతు వ్యర్థాలతో చేపల సాగు చేస్తుండడం పలు గ్రామాల్లో రైతులకు హాని చేస్తుండగా, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. వేసవి ముగిసి ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు చెరువుల్లో నీరు చేరి క్రమేపీ చేపల సాగు పెరుగుతోంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా పెంపకందారులు జంతు వ్యర్థాలను మెషీన్లలో వేసి చేపలకు దాణాగా ఉపయోగిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో చెరువుల చుట్టూ తీవ్రదుర్గంధం వ్యాపిస్తోందని వ్యవసాయ పనులకు కూలీలు రావడం లేదని వాపోతున్నారు. దుర్గంధంతో రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. మారుమూల అటవీ ప్రాంతాలకు సమీపంలో అనధికారికంగా కొన్నిచోట్ల, అధికారికంగా మరికొన్ని చోట్ల చేపల సాగు చేస్తున్నారని, దాదాపు చెరువులు అన్నింటిలోనూ జంతు వ్యర్థాలనే దాణానే ఉపయోగిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. జంతు వ్యర్థాలను తినడానికి వచ్చే మృగాలు తమపై దాడులు చేస్తున్నాయని, రాత్రి సమయంలో పొలాలకు వెళ్లలేకపోతున్నామని గంగవరం, రాజవరం గ్రామాల రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులు చెరువుల్లో నీరు తాగుతుంటే వ్యాధుల బారిన పడుతున్నాయని చెబుతున్నారు. తెలంగాణ నుంచి నిత్యం వాహనాల్లో వస్తున్న జంతు వ్యర్థాలను గోడౌన్లలో భారీగా నిల్వ ఉంచి, అనంతరం వాటిని దాణాగా ఇతర ప్రాంతాల్లోని చేపల చెరువుల నిర్వాహకులకు విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. ఒక్కోసారి చెరువుల్లో వేస్తున్న జంతు వ్యర్థాల ప్రభావానికి కొన్ని రకాల చేపలు మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. నిషేధిత జాతుల చేపలు వ్యర్థాల కారణంగా ఒకటికి నాలుగు రెట్లు ఉత్పత్తి అధికంగా ఉండడంతో పెంపకందారులంతా జంతు వ్యర్థాల వినియోగానికే ప్రాధాన్యత ఇస్తున్నారని చెబుతున్నారు. కొయ్యలగూడెం మండల వ్యాప్తంగా అనేక చెరువుల్లో జంతు వ్యర్థాలతోనే చేపల సాగు చేస్తున్నారని తెలిపారు. ఐతే మత్స్యకార సంఘాలు నిబంధనలతో కూడిన దాణాను వినియోగిస్తున్నప్పటికీ వారికి కూడా స్థానికులతో ఘర్షణలు ఏర్పడుతున్నాయని ఫిషరీ డిపార్ట్‌మెంట్ అధికారులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులను లోబరుచుకోవడం వల్ల అక్రమాలకు పాల్పడుతున్నారని, ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

చింతలపూడి : వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉం,డి సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా ఆదేశించారు. చింతలపూడి సబ్ డివిజన్లో వ్యవసాయశాఖ సిబ్బందికి స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని, రుణాలు ఇప్పించాలని క్రాఫ్ ఇన్సూరెన్స్ కట్టించాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించబోతున్న సందర్భంగా రైతుల గ్రీవెన్స్‌ను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం స్టేట్ బ్యాంక్ మేనేజర్‌ను కలిసి రైతులకు రుణాలు మంజూరు చేయాలని, ఇన్సూరెన్స్ త్వరగా కట్టించాలని కోరారు. కార్యక్రమంలో నాలుగు మండలాల మండల వ్యవసాయ అధికారులు మురళి, ప్రదీప్, ముత్యాలరావు, ప్రియాంక, టెక్నికల్ ఏఓ ప్రసూన,. సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: రైతులు చిరు ధాన్యాల సాగు వైపుగా వెళ్లాలని, మార్కెట్ కూడా ఆశా జనకంగానే ఉందని ఏరువాక ఏలూరు జిల్లా సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్, ఎక్స్‌టెన్షన్ శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబులు అన్నారు. పోలవరం మండలం వింజరం పంచాయతీలో చిరుధాన్యాలు సాగు ప్రాముఖ్యతపై ఏర్పాటుచేసిన సదస్సులో వారు మాట్లాడారు. సిరి (చిరు) ధాన్యాలు సాగు చేస్తే విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. మినుములు బీపీఎస్-8, పీయూ-31, టీబీజీ-104 రకాల లక్షణాలు, దిగుబడులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న పంటపై ముఖ్యంగా కత్తెర పురుగు నివారణకు పురుగు మందులు, బయోలాజికల్ కంట్రోల్ పద్ధతులను పాటించాలన్నారు. జాతీయ ఆహార భద్రత, పోషక మిషన్ పథకంలో భాగంగా 50 శాతం రాయితీపై వచ్చిన మినుములు విత్తనాలను సర్పంచ్ చేతుల మీదగా రైతులకు అందజేశారు. వింజరం సర్పంచ్, మండల వ్యవసాయ అధికారి పోలవరం, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.